విశ్వనాథ వారి



# ముద్దు పద్దన్లు-4

సంకలనకర్త: డా. వెలిచాల కొండలరావు

విశ్వనాథ సాహిత్య పీఠం ప్రచురణ

విశ్వనాథ వారి

# ముద్దువడ్డన్లు – 4

సంకలనకర్త : డా. వెలిచాల కొండలరావు

విశ్వనాథ సాహిత్య పీఠం ప్రచురణ

విశ్వనాథ వారి

# ముద్దువడ్డన్లు-4

సంకలనకర్త : డా. వెలిచాల కొండలరావు

© 2004 విశ్వనాథ సాహిత్య పీఠం ప్రచురణ

For Copies **SISTER NIVEDITA FOUNDATION**
11-4-654/3, Red Hills, Lakki-ka-pul, Hyderabad - 500 004.
Ph : 23396358 / 23305134

**M/S. VISALANDHRA BOOK HOUSE**
4-1-435, Bank Street, Hyderabad - 500 001.
and all its Branches in A.P.

Rs. : 5011/-

Printed at **PARTHASARATHI PRINTERS**
Nallakunta, Hyderabad - 44.
Ph : 55108206 / 56608206

# ముందుమాట

"సత్యనారాయణగారు ఎప్పుడూ సాధువే! కాకపోతే, ఎవరైనా అన్యాయంగా గిల్లినప్పుడే ఆయనకు కోపం వస్తుంది. (ఆ గిల్లడం వ్రాతలతో కావచ్చు, చేతులతో కావచ్చు, మాటలతో కావచ్చు). అప్పుడే తిడతాడు. ఆ తిట్టడం మాత్రం మహా ఆనందంగా ఉంటుంది. (కోపానికి బదులు గిలిగింతలు పెట్టినట్టు). అందుకనే చాలా మంది కావాలని గిల్లి మరీ తిట్టించుకొనేవారు." (లక్ష్మణ యతీంద్రులు)

Satireలో, sarcasmలో, సున్నితమైన, సుకుమారమైన మందలింపులలో, ఎద్దేవాలలో సత్యనారాయణగారిది ఆరితేరిన చేయి. అతడి కోపం పిల్లవాడిపై తల్లి కోపం లాంటిది. ప్రేమతో కూడినదే కాని ద్వేషంతో, అసూయతో కూడినది కాదు. అందుకే సత్యనారాయణగారంటే అందరికీ అప్పటికీ ఇప్పటికీ అంత ప్రేమ.

సత్యనారాయణగారికి అప్రతిభావంతులంటే, చదవకుండా, ఎదగకుండా, అర్థం చేసికోకుండా, అర్థంచేసికొనే తహతూ తర్ఫీయతూ లేకుండా మాట్లాడేవారు, విమర్శలకు పూనుకునే వారంటే తెగకోపముండేడిది. చెడా బడా వాడిని వాడెంత వాడైనా చీదరతో, చివాట్లతో చెంపలు వాయించినట్లు వాయించేవారు. అయినా వారు వాటిని తిట్లుగా కాక దీవెనలుగానే భావించేవారు ఏ కొందరో తప్ప. తిట్టి కూడా భళే అని అనిపించుకున్నవారు బహుశా వారొకరేనేమో! బహుశా సాహిత్యపరమైన శత్రువులే కాని వ్యక్తిగతమైన శత్రువులు లేని అజాతశత్రువు వారొకరేనేమో!

ఈ రోజుల్లో హాస్యానికన్నా అపహాస్యానికి గిరాకీ ఎక్కువైపోయింది, చమత్కారానికన్నా కారానికి, ఛలోక్తికన్నా పర్షోక్తికి. సున్నితమైన సుకుమారమైన, అందమైన, అద్భుతమైన, ఆశ్చర్యకరమైన మాటకాని, మాటకుమాటేకాని, ఔచిత్యమైన చిరుచిటపటలకేకాని ఆస్కారం చాలా తక్కువైపోయింది. ఇంకా చెప్పాలంటే, మాటల్లో, చేతల్లో హుందాతనం తక్కువైపోయి వెకిలితనం, వెర్రిబాగుల వాగుడు ఎక్కువైపోయింది. దాని వలన మనుషుల మధ్యా మనుషుల మధ్యా ఉండవలసిన సహృద్భావం తగ్గి ముభావం, ముక్కోపి భావం పెరిగిపోతోంది.

"మీ సాహిత్య జీవితంలో మరపురాని సంఘటనలు చెప్పండి" అని శ్రీశ్రీని ఎవరో అడిగారట ఒక తూరి. దానికి వారు

"ఒకటి - మహాప్రస్థానం గీతాన్ని భారతి మాసపత్రిక తిరగ్గొట్టడం.

రెండు - కవితా! ఓ కవితా! అనే గీతం చదువుతూ ఉంటే విశ్వనాథ సత్యనారాయణగారు అశ్రుసిక్త నేత్రులు కావడం" అని అన్నారట.

అలాగే, విశ్వనాథ సత్యనారాయణ గారి మరణానంతరం డా. సి. నారాయణ రెడ్డిగారిని ఎవరో ఒక విమర్శకుడు "మీ అభిప్రాయాలకి విశ్వనాథ అభిప్రాయాలకి పడదుగదా, మరి మీరు ఆయన దివంగతులైనప్పుడు "హిమాలయ పర్వత శిఖరం విరిగి పడిపోయింది" అన్నారట, అట్లా ఎందుకన్నారు." అని అడిగితే "చచ్చిపోయిన వాళ్ళని సంస్మరించేటప్పుడు తిట్టే సంస్కారం కాదు నాది. ఆయన నిజంగా తెలుగు సాహిత్యంలో హిమాలయ పర్వత శిఖరం లాంటి వాడే. ఆ మాటే అన్నాను" అని అన్నారట.

అదీ సంస్కారమంటే, సహృదయతంటే, సాహిత్య ఔదార్యతంటే, స్నేహశీలతంటే, నిజమైన నిష్పక్షపాత అవగాహనంటే. ఈ రోజుల్లో వలె శ్రీనాథులమని చెప్పుకొంటూ కోతుల వలె కీచులాడు కోవటం, ప్రతి సాహిత్యపరమైన విబేధాన్ని వ్యక్తిగత వివాదంగా, వ్యతిరేకంగా తీసికొని ముఠాలు ముఠాలుగా రాజకీయ వాదుల్లా విడిపోవడం కాదు, విరుద్ధాలు పెంచుకోవడం కాదు.

బహుశా, సాహిత్యంలో, మరీ కవిత్వంలో, తెనాలి రామకృష్ణుని తదుపరి గద్యంలోనైనా, పద్యంలోనైనా ఛలోక్తి, చతురత, చమత్కారాల చెమక్కులు విస్తృతంగా విసిరిన వారు కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు తప్ప మరొకరు మనకు కనిపించరేమో?అంతటి హుందాతనం ఉన్నవారు, అంతటి సమయస్ఫూర్తి,

సందర్భ ఔచిత్యం కలవారు, ఏరికోరి ఏర్పడకుండా ఎగతాళి చేయగలవారు, నొప్పించకుండా ఒప్పించగలిగేవారు మరొకరు లేరేమో? పీఠికలు వ్రాసినా, వ్యాసాలు వ్రాసినా, కథలు వ్రాసినా, నవలలు వ్రాసినా, నాటకాలు వ్రాసినా, కవితలు వ్రాసినా, ఉపన్యాసాలిచ్చినా, పాఠాలు చెప్పినా, కమ్మకమ్మని హుషారు మాటలు చెబుతూ చిన్న చిన్న సంభాషణ వాక్యాల్లాంటి వాక్యాలతో నవ్వుతూ నవ్విస్తూ, సరదాగా సంబరంగా చివాట్లు పెడుతూకూడా చివుక్కుమనిపించని వారు ఒక్క విశ్వనాథ తప్ప గత రెండు శతాబ్దాలలో మనకెవ్వరూ ఎక్కడా కనిపించరేమో?

విశ్వనాథ అభిప్రాయాలతో ఏకీభవించని వారుకూడా విశ్వనాథగారి ప్రతిభను కొనియాడనివారు లేరు. అదీ ఆయన వ్యక్తిత్వం, అదీ ఆయన పర్సనాలిటీ, అదీ ఆయన గొప్పతనం, ఆయన సర్వకాలీన సార్వత్రిక acceptability.

జీవితాన్ని క్షుణ్ణంగా అన్ని దృక్కోణాలనుండి పరికించి, అనుభవించి, ఆకళింపుచేసికొని, జీవిత పరమార్థంతో దానిని జోడించి, తాత్త్విక దార్శనిక దృష్టియను సానపై దానిని సానబట్టి సాహిత్య సారస్వత కృషి చేసిన మహామనిషి, కళలు సృష్టించడం కలలుకనడం తప్ప కల్లాకపటమెరుగని కమనీయ హృదయుడు. నిజమైన సత్యాగ్రహి, నిష్కలంకి, నిరాడంబరి, నిత్యసత్యజీవి. లేకపోతే ఎలా అనగలడు సాక్షాత్తు రామున్నే దాదాపు కళ్ళారా చూచానని? ఎలా వ్రాయగలడలా అంత కమ్మని రామాయణాన్ని, కల్పవృక్షాన్ని, కామధేనువుని?

విశ్వనాథ సాహిత్యంలో, వారి పీఠికలలో, ఉపన్యాసాలలో, ఉత్తరాలలో వర్ణనతో పాటు వ్యంగ్యానిది, Satireది, sarcasmది, Humorది, ironyది ఎంతో కొంత భాగం వృత్తానికి ఒక మేలి ముసుగులా అచటచటా ప్రతిబింబిస్తూ పదార్థానికి పసందైన పదును పెడుతుంది. ఇది సంఘం ఒక విధంగా కాక మరొక విధంగా పోవడాన్ని సూచిస్తుంది. వ్యక్తులు, సంఘాలు, దేశాలు ఎలా పెడదారిలో, పెంకెదారిలో పోతున్నాయో, అలా ఎందుకు పోగూడదో వ్యాఖ్యానిస్తుంది.

విశ్వనాథకు చెందిన వర్ణనలు, అలంకారాలు, సమాసాలు ఎంత ప్రసిద్ధమో, వారి సుతిమెత్తని సూదిపోటు మాటలు కూడా అంతే ప్రసిద్ధము. Bernard Show, Oscar Wilde, Gold Smith, Voltaire వారిలా సత్యనారాయణగారికి ఎలా భావనవ్వులతో, భాషామువ్వలతో నాట్యం చేయించాలో తెలుసు. "విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు" లో హాస్యంతో, వెక్కిరింపుతో, దెప్పడంతో, ఎద్దేవాచేయడంతో విశ్వనాథవారు హ్యూమర్‌లో ఎంతపై స్థాయికి ఎంత హుందాగా పోగలరో మనకు విదితమవుతుంది. వారి "చిన్నకథలు"లో మనం వాటిని చదువుతూ చదువుతూ మనమే నవ్వుకునే ఎన్నెన్నో సన్నివేశాలు మనకు కనబడతాయి. "వేయిపడగలు"లో తదితర రచనలలో కూడా అచటచటా వారి హాస్యప్రతిభ కనబడుతూనే ఉంటుంది.

విశ్వనాథ సత్యనారాయణగారి పీఠికలు, ఉపన్యాసాలు, వ్యాసాలు, తదితర రచనలనుండి, ప్రత్యేకంగా "విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు", "పులుల సత్యాగ్రహం", "చిన్నకథల" నుండి సేకరించిన కొన్ని ముచ్చటైన ఛలోక్తులు, చమత్కారాలు, వ్యంగ్యాలు, అధిక్షేపాత్మక మాటలు దిగువ సుదహరిస్తున్నాను, మరికొన్ని మరొక పుస్తకంలో పొందుపరుస్తాను.

*****

వాడు నన్నొక్కసారె౦దుకు చంపుతాడే? పిచ్చిదానా! రోజూరోజూ చంపుతూనేవుంటాడు. నాల్గురూపాయలు కావలసి ఒకసారి చంపుతాడు. పది రూపాయలు కావలసి మరోసారి చంపుతాడు. వాడిదాకా ఎందుకు? ఇంట్లో అవిలేవు ఇవిలేవు అని నువ్వే (భార్య) చంపుతూ వుంటావాయె. నేను ఇన్సూరు చేద్దామంటే మొదట ఒక యాభైరూపాయలు కట్టటానికే చస్తాననుకో. తరువాత ప్రీమియములు కట్ట గలుగుదునా. పెట్ట గలుగుదునా? ఈ యాభైరూపాయలు ఎవరికి లాభమో తెలుసునా, అక్కడ ఉన్న గుమాస్తాలకు లాభం. వాళ్ళకి జీతాలు వస్తవి గనుక. మరెవరో అదృష్టవంతుడు పదివేలకి ఇన్సూరు చేసి రెండేళ్ళలో చచ్చి ఊరుకుంటాడు. వాడికిదివరకే డబ్బుంటుంది. లేకపోతే పదివేలకెట్లా ఇన్సూరు చేస్తాడు? వాడు చస్తే వాడి కుటుంబం ఎల్లా బ్రతకాలా అన్న విషయం వాడి కుటుంబానికి లేనే లేదు. కాని ఈ పదివేలు కూడా వస్తవి. ఆ పదివేలల్లో నా యాభైరూపాయలు కూడా ఉంటవి. (దమయంతీ స్వయంవరం)

567

నీదెస జాటుభావములు నెట్టవుచిక్కని కావ్యభావముల్
ప్రోదియెనర్చికూర్చునను బ్రోడతనంబును జూపురిట్టనీ
మైదొరకొన్నయీ ప్రతిభమంజులమైన పురాణమల్లుమా
మాదిగమాలలన్న కొఱమాలిన దౌష్ట్యము లంతరింపగా (నారాముడు – నారామాయణము)

568

కచహరీలలో (కఛేరీ=office) ఉండేవాళ్ళు ఒక్కొక్కడు ఒక్కొక్క కచహరి. అనగా దుశ్శాసనుడన్నమాట. వాడు ద్రౌపది కొప్పు పట్టుక లాగాలె. కచమంటే జుట్టు, హరి అంటే హరించేవాడు. వాడు దుశ్శాసనుడు. దేని మీదనైనాసరే, ఒక రిమార్కు వ్రాసి కాగితాన్ని తిరగగొట్టేస్తాడు తప్పు చచ్చినా సాఫీగా పోనివ్వడు. నాలుగు రూపాయలు నీకు కావాలనుకో! దానికి నాలుగు డిపార్టుమెంటులమీద ఆర్డరులు పుట్టాలి. ఒక్కొక్క డిపార్టుమెంటులో పదిపదకొండు చేతులలోంచి వెళ్ళాలి. ఎవడిచేతికి వెళ్ళేటప్పుడో వర్జపు వేళ అయిందనుకో, తమాంషుద్, ఫినిష్, ఇంకేమున్నది. (దమయంతీ స్వయంవరం)

569

“ఆరుద్ర” (ఇట్లాంటి పేర్లకు ‘గారు’ కలపటం విపరీతంగా ఉంటుంది. “ఆరుద్రగారు” అంటే ఏదో వెగటుగా ఉంటుంది. అందుచేతనే అదివాడడం లేదు) చాలా మంచి పని

చేస్తున్నారని చెప్పాలి. శేషాచలం కంపెనీ వారు. ఆయనను తన లోతులు తాను తెలిసికొనే టట్లు చేస్తున్నారు.

570

వాడు తప్పుమాట రైటంటాడా! అనడని ఒక ధైర్యం ఉంది. కాని ఒక అనుమానం గూడా ఉంది. పెద్దపెద్ద రాజకీయవేత్తలూ చాలా విషయాలు తెలిసినవాళ్లేగదా ఈ తప్పు రాసేది. వీడు ఆ జాతిలో వాడేగదా! వాళ్ళ తెలివికి, వాళ్ల భాషా జ్ఞానానికి నంబంధం ఉండదు. అనేక విషయాలు చదివి తెలుసుకుంటారు, గాలిలో తెలుసుకుంటారు. తీరా శబ్దం దగ్గరకు వచ్చేటప్పటికి పిల్లల్ని పెడతారు. నిజమే! ఊరివెంట తిరిగి కాఫీహోటళ్లలో ఆ చెత్తా ఈ చెత్తా తినేవాడికి అన్నం ముందర కూర్చుంటే ఏమి సంయిస్తుంది? ఇందులో ఉప్పెక్కువయిందనీ, ఈ కూర శ్రాద్ధయోగ్యంగా ఉందనీ, ఈ పచ్చడి దగ్ధయోగ్యముగా ఉందనీ కొంపలో నానా గోలా చేస్తారు. కొందరు "కాప్టెన్సూ", "ప్లేయర్సూ" మొదలయిన సిగరెట్లు తాగేవారలకు చార్మినార్ సిగరెట్టులు రుచిస్తవా? ఆ పెద్ద తరగతి సిగరెట్టులలో నల్లమందు వేస్తారట. నల్లమందు నీటిలో నానబెడతారట ఆ పొగాకు. అందుచేత అవి తాగేవాడికి చిన్న రకపు సిగరెట్లు పనికి రావు. ఇది అచ్చమైన పొగాకు. నికారసైనపొగాకు. కల్తీలేని పొగాకు, ఇది వాళ్ళకెందుకు నచ్చుతుంది? అట్లాగే హోటళ్ళలో తిండిలో వాళ్ళు ఏదో వేస్తారు. అసలా రుచేవేరు. ఇదని చెప్పటానికి వీలులేదు. అదొక వర్తక రహస్యం. దాన్నే ఇంగ్లీషులో 'ట్రేడ్ సీక్రెట్' అంటారు. ఆ తిండికి మరిగిన తరువాత కొంపలో తిండి ఎట్లు నచ్చుదో? గాలిలో పాండిత్యం సంపాదించడం మొదలు పెట్టావా, శబ్దమంటే విరోధం పుడుతుందనుకో. ఇంటికన్న గుడి పదిలమని ఊహాతేరగా బోలెడంత జ్ఞానం వచ్చి పడుతుంటే పుస్తకాలు చదువుకోవడం ఎందుకు? చక్కని శబ్దస్వరూపజ్ఞాన మెందుకు? ఒక మోటుసామెత ఉందిలెండి! కాకులు కరణాలు నావైపైతే ఎట్టా కొడతావో కొట్టరా మొగడా అని. వాళ్ళని మనమేం చేస్తాం. (దమయంతీ స్వయంవరం)

571

నారచనలో తప్పులు లేవని కాదు. ఉన్నవి. తప్పులు లేకుండా వ్రాసే మహాకవి సృష్టిలో ఉండడు. కాని, నా రామాయణంలోని తప్పులు అందరి బుద్ధికి సులభంగా అందేవి కావు. తప్పులు పట్టాలనే పట్టుదలతో చదివితే నేను ఏ ఔచిత్యం కోసం, ఏ శిల్ప సౌందర్యం కోసం, ఏ రస సిద్ధి కోసం అలా ఎందుకు వ్రాశానో, అసలు ఆలోచించే స్థోమత ఎక్కడ ఉంటుంది? నేను వ్రాసిన కావ్యంలోని గుణాలు ఎలా గోచరిస్తాయి? నా కావ్యం సహృ



దయతతో చదివేవాడు ఈ సంకుచితములైన అవరణాలు దాటినపుడు నా రచనకు ఆధీనమైపోతాడు. కాబట్టి అప్పుడు నేను వ్రాసిన తప్పులు వెదకుతూ కూర్చునే వ్యవధి కలుగదు. ఉన్నతమైన భావాన్ని కవి ఎలా చెప్పాడనునది ప్రధానం. దాన్ని అందుకోవడానికి విమర్శకుడు ప్రయత్నించాలి.

572

ఈ దేశంలో ఉన్నటువంటి కరువుకు ఇద్దరు కారకులు. రాచరికం వాళ్లు, వర్తకులు. రాచరికం వాళ్ళని ఏమన్నా అంటే అనవచ్చు తప్ప, వర్తకులని ఏమీ అనటానికి వీల్లేదు. వాళ్ళు దుకాణాలన్నీ మూసివేస్తారు. ఒక్కొ క్కప్పుడు అలగాజనం ఎగబడి దోపిళ్లు మొదలు పెడతారు. ఆ దోపిళ్ళ రహస్యం చాలా చమత్కారంగా ఉంటుంది. " మామయ్యా. నేనప్పటికి చిన్నవాణ్ణేగాని, నాకా పొట్టి శ్రీరాములుగారు పోయినాడని వార్త వచ్చింది. ఊరంతా పోయి రైలుస్టేషను మీద పడ్డారు. రైళ్ళాపేశారు. సామానుల వాగన్లు పగల గొట్టారు. దోపిడీ ఎట్లా జరిగిందంటే చెప్పడానికి వీల్లేదు. కొన్ని వేల రూపాయల సరుకు ఊరంతా పంచుకున్నారు. పోలీసులవాళ్ళు చూస్తూనే ఊరకొన్నారు. వాళ్ళల్లో కొందరు చేయండి, చేయండి అని ప్రోత్సాహం ఇచ్చిన వాళ్ళూ ఉన్నారు. అదేమిటో సాయంత్రం ఐదు గంటలకి ప్రతి రోడ్డుమీదా రిజర్వు పోలీసులు నిలుచోవటం, మనుష్యులని కొడుతూ ఉండటం. చిన్నాలేదు, పెద్దాలేదు. ముసలివాళ్లూ, కుట్టివాళ్లూ. నాకప్పుడెనిమిదేళ్ళున్నా యనుకుంటా. నాకూ తగిలింది దెబ్బ మామయ్యా. మాస్టర్లేమిటి, డాక్టర్లేమిటి, లక్షాధికార్లేమిటి, పెద్ద వర్తకులేమిటి? ఎవరినయితే ఏమిటి వాళ్ళకు కొట్టటమే పని". స్టేషన్ మీదపడి దోచుకోవటం ప్రొద్దున జరిగింది. సాయంత్రపు పూట ఈ పెట్టే అదుపున కర్థమేమిటి? దున్నపోతు ఈనిందిరా అంటే, దూడను కట్టివేయమన్నాడట. అల్లా ఉంటై పోలీసు వాళ్ళ పనులు. వర్తకు లిట్లా ధరలు పెంచతూ ఉంటారు. రాచరికంవాళ్ళు ధరలను పెంచకూడదని ఆజ్ఞ పంపిస్తారు. వీళ్ళు వస్తువులు దాచేస్తారు. జనం దోచేస్తారు. దోచే సమయంలో పోలీసువాళ్ళు మాటాడకుండా ఊరకుంటారు. తరువాత వస్తారు పోలీసువాళ్ళు. ఎవళ్ళని పట్టుకొంటారో తెలియదు. అక్కడనుంటీ ఈ దోచబడ్డ సొమ్ము ఎవరింట్లో ఉందో ఆరాలు తీస్తారు. బురద తొక్కనేల, కాలు కడగనేల అనంటే, కాలు కడుగుకొనేందుకే బురద త్రొక్కటం అన్నాడు. ఈ పోలీసువాళ్ళు దోచే సమయంలో ప్రజలు, ఆరాలు తీసేటప్పుడూ అరెస్టు చేసేటప్పుడూ పోలీసువాళ్ళు. అల్లావుంది కథ. (దమయంతీ స్వయంవరం)

573

ప్రతివాడును గాయకుడగుట లేదు. ప్రతివాడును భాషావేత్త యగుట లేదు. ప్రతివాడును కవి యగుటలేదు. ఎందుచేత? ఈ దేశవము తత్తత్పూర్వ జన్మ సంస్కార విశేషమని సమాధానము చెప్పుచున్నది. పరదేశములు దీనిని గూర్చి యాలోచింపవు. ఆలోచించుట బరువు. వాని గొంతు చీల్చి వాని కంఠనాళములు పరీక్షించి నిర్ణయించుటకు ప్రయత్నించును. లేదా వాని బుర్రలోని మెదడులను పరిశీలించును. దాని మార్గము వేరు. మన మార్గము వేరు. (పీఠికలు 2 – భారతీ నిరుక్తి)

574

ప్రేమ అంటే ఎమిటి? ఆవతల వాళ్ళలో వున్న దోషాలను పరిగణించకుండా ఆ దోషాలను మన్నించి వాళ్ళయందు మమకారం కలిగి ఉండటం. దోషాలనిచూచి మనం ఎవరితోనైనా సంబంధాలు వదలుకుందామంటే పెళ్ళాం పెళ్ళాం కాదు, కొడుకులు కొడుకులు కారు, చుట్టాలు చుట్టాలు కారు. వాళ్ళుచేసే పనులకు ఎప్పుడూ కోపం వస్తూనే వుంటుంది. ఆ కోపం ఎంతసేపుంటుంది? మళ్ళీ మరునిమిషంలో ప్రేమే. అల్లాగే దేశం విషయంలో కూడాను. కాశీ యాత్రకి వెళ్ళావనుకో. ఇంటికి తిరిగి వచ్చేవరకూ ఆ హిందీవాళ్ళతో సతమతమయి వస్తావుకదా! పైగా వాళ్ళతో మనకింగ్లీషు వచ్చుగదా అని మాట్లాడ పోయావా? వాళ్ళకు ఇంగ్లీషంటే ఇంతా అంతా ద్వేషమని చెప్పటానికి వీల్లేదు. బెంగాలుకు వెళ్ళు. వాడు బెంగాలీ తప్ప మాటాడడు. బీహారు వెళ్ళు, హిందీకాక ఇంకొకటి మాటాడావా, నీ శాల్తీ తిరిగి మళ్ళీ ఊరురాదు. అరవవాళ్ళకి కజక్కం ఉంది. ఎందుకూ పనికిరాని వాళ్ళు ఒక్క తెలుగువాళ్ళే. వీళ్ళు తెలుగువాళ్లేనా? వీళ్ళ మాతృభాష ఇంగ్లీషు. వాళ్ళు పుస్తకాలలోనే ఇంగ్లీషు మాటలు వ్రాస్తుంటారు. వీళ్ళ ప్రగతిలో అదొక భాగం. ఇదంతా ఏదో దోషమల్లే కనిపిస్తుంది తప్ప నిజానికిది చాలా గొప్పగుణం. ఎందుచేతనంటే ప్రపంచకవంతా పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ వెళుతూంది. ఎక్కడకు వెళుతున్నది? 'జగదేక కుటుంబకం' అన్న మహాసిద్ధాంతానికభిముఖంగా వెళ్లుతూంది. అన్ని రాజ్యాలూ కలిసి ఒకటే రాజ్యం. ఒకటే భాష, ఒకటే నియమావళి, అప్పుడు యుద్ధాలుండవు. విడివిడిగా ప్రతి రాజ్యానికి వాళ్ళవాళ్ళ సైన్యాలు వాళ్ళవాళ్ళకుండవు. కలిసి కట్టుగా అన్ని రాజ్యాలకూ కలిపి ఒకటే సైన్యం వుంటుంది. యుద్ధాలు లేనప్పుడు సైన్య మెందుకనుకుంటారేమో! ఏదైనా దేశంలో ఒకానొక విప్లవం జరిగితే ఆ విప్లవాన్ని అణచేందుకు మాత్రమే ఆ సైన్యం. అరే! అంతమంచి ప్రపంచకంలో విప్లవాలు పుడతావా అంటారేమో మీరు. పుడతవనుకొని మన జాగ్రత్తమీద మన ముండాలె. అందుచేత ఏకభాషకోసం, ఏక రాజ్యంకోసం, ఏకసౌహార్థం కోసం మన నాగరికత ప్రయాణం చేస్తున్నది. అటువంటి సిద్ధాంతానికి అనుకూలంగా వున్నది ఒక్క మన తెలుగుదేశమే.



మన తెలుగుదేశం పండి, మగ్గి, ప్రగతిని ఇంచుమించుగా సిద్ధింపజేసుకుంది. ఈ తెలుగు దేశంలో మరికొందరున్నారు. వాళ్ళు యుగాకృతులు. యుగానికీ వాళ్ళకీ అభేదాధ్యవసాయము. నీవు యుగాన్ని ఏమన్నా అను. వాడు నీమీద కత్తిగట్టాడన్నమాటే. అసలు ఈ భవిష్యన్నాగరికతకూ కత్తిగట్టటానికీ సంబంధం లేదు. ఈ భవిష్యన్నాగరికత పరమ శాంతమైన నాగరికత. కాని శాంతిని ఎట్లా సాధిస్తారు? కత్తులవల్లనే సాధించాలి. సామాన్యంగా పత్రికల్లో వార్తలు పడుతుంటవి చూడండి. ఒక వూళ్లో ఒక అల్లరి జరిగింది. పోలీసువాళ్ళు వెళ్ళారు. కొందరిని తుపాకులతో కాల్చారు. కొందరిని ఖైదులో వేశారు. ఊళ్లో ఎవ్వరూ ఇద్దరు కలిసి తిరగకుండా కట్టుదిట్టం చేశారు. ఊళ్లో పిట్ట ఆడటంలేదు. ఈ విషయాన్ని పత్రికల్లో ఏమని వ్రాస్తారు. "ఆ వూళ్లో శాంతి నెలకొల్పబడినదని" వ్రాస్తారు. కనుక శాంతిని ఎట్లాసాధించేది? తుపాకులద్వారా, చెరసాలల ద్వారా, పోలీసువాళ్ళ చేతులలోని లాఠీలద్వారా. అందుచేత మనదేశంలోని ప్రగతివాదులు సర్వప్రపంచకం భవిష్యత్తులో ఒక్క కుటుంబంగా వుంది. మహాశాంతికాలాన్ని సాధించే అందుకోసం అందరిమీదా కత్తికడుతూ ఉంటారు. ఆ కత్తి ఒక్కొక్కప్పుడు పెన్సిలుకూడా చెక్కడానికి సాధ్యంకాని మొండిచాకు కావచ్చు. పైగా ఇప్పుడు ఆ కత్తులతో ఏమవసరం ఉంది? మనము రెండుమూడుసార్లు గడ్డంచేసుకోగా పనికిరాని బ్లేడ్లు ఉన్నవికదూ! మాపిల్లలు ఎప్పుడు పెన్సిలు చెక్కుకోవలసివచ్చినా, నాన్నా! చాకు యిమ్మని అడగనే అడగరు. నాన్నా! పాతబ్లేడువుంటే యిమ్మని అడుగుతారు. వాని మీద కత్తికట్టుట అనేటువంటి దేశోక్తి కూడా భాషలోంచి పోవలసిన వాటిల్లోదే. దర్జాగా ఉండాలంటే వాడిమీద తుపాకి కట్టాడు అను. కాదు ఏదో సంసారపక్షంగా మాట్లాడాలంటే, వాడి మీద బ్లేడు కట్టాడు అను. వానిమీద కత్తికట్టాడేమిటి. ప్రాతభాష. దీనినే యశఃకాములైన నూత్న యువకవులు అరిగి పోయిన పిన్నులనీ, చెల్లని డబ్బులనీ, మొదలైన మాటలతో సభలల్లో ఆక్షేపిస్తూ, వారికంటే వివేకులైన సామాజికులచేత తమకీర్తి కాంతకు వాయిల్ చీరెలు, నైలాన్ రెవికలూ కుట్టించు కుంటున్నారు. (దమయంతీ స్వయంవరం)

575

నేను అద్వైతిని. నాకు శివకేశవులకు భేదము లేదు. విష్ణువునకు రామునకు భేదము లేదు. నేను వ్రాసినది రామాయణం. అంకితమిచ్చినదియు విశ్వేశ్వరస్వామికి. కల్పవృక్షం యొక్క ఖండాంత పద్యములన్నియు గాఢమైన శివభక్తి వీరములు. పేరు శివుడు. ఆయనయే రాముడు. వారు బ్రహ్మ పదార్థము. ( నా రాముడు – ఆనందమూర్తి)

576

"మీ చదువు గురించి రాము డొకసారి అడిగితే చెప్పాను. మీ విద్యపేరు క్లేశవిద్య యని. కొసల శబ్దానికి వికృతి క్లేశ శబ్దం. కానీ సంస్కృతంలోనే క్లేశ మంటే కష్టమని, దుఃఖమని అర్థం. అందరూ క్లేశవిద్య అనరు. 'ఇక్లేశ విద్య' అంటారు. ఎందుచేతనంటే, సంయుక్తంగా వున్న అక్షరం ఉచ్ఛరించడం కష్టం గనుక సామాన్య జనం దానివెనుక 'ఇ' కలుపుతారు. మధ్యన ఒక సున్న పెడితే ఉచ్ఛరించడమింకా తేలిక. అందుచేత మీ భాషకు ముక్కుమొగం లేదు. అది భాష కాదు."

## 577

నాల్గునాళ్ళు మబ్బులు మూసి మూసి మదరాసులో గుండెపోతపోసెను. తారురోడ్డుమీద కొన్నిచోట్ల సీలమండలమంటి, పిక్కలమంటి నీరు ప్రవహించెను. సూర్యుడు కనిపించలేదు. ఒక నిలువుజల్లు వచ్చి తటపెట శిరో భుజతాండవముచేసి పోవును. మఱియొక ఏటవాలు జల్లు వచ్చి పృష్ఠవక్షోభాగములు గదాఘాతములవలె చరచిపోవును. ఒక నాజూకు గొడుగు వెనుకకు విరచుకొని, శిరస్త్రాణము కాదుకదా బెత్తముల నన్నింటిని విరచి ప్రోగులుపెట్టును. ఆ విపరీత ప్రసరణము జరిగిన గొడుగును గాలి కెదురుగా బట్టినచే దిరిగి ఛత్రమగును. కాని యంతలో గగ్గోలుపడిన యాఛత్రవంతుని బుద్ధి గాబరాబడి తడియునుగాని యూహింపదు. ఆ ఝంఝుకునామేఘునకు నా వాత్యపి నీ యమాయకుని యమాయకత తెలియును. ప్రక్కనబోవుచున్న బుద్ధిమంతుడు " ఓయీ! గొడుగు గాలి కెదురుపట్టుము. మరల సరిగా నుండు" నని చెప్పును. ఆ మాటయే వినిపించుకోడా జానపుదుడు, అదియేమి మనుష్యప్రకృతియెూ? ప్రక్కనబోవుచున్న యొక కిగ్గాడి, కాదు కాదట్లే యుంచుకొమ్మని పరిహాసముచేయును. ఆ గొడుగువాడు వెట్టి – వానికి పరిహాసకునిమాట యధార్థమనిపించును. ఎందుచేతనో ఈ జానపదుని మనస్సు తన యనాగరికతచేత దన యనూహశాలిత్వముచేత, నా కిగ్గాడిమాట సమీప వస్తువుగా భాసించి, యా యుత్తముడై, నాగరికుడై తోడిమానవుల కష్టమునకు సానుభూతి చూపు పెద్దమనుష్యుని మనస్సు విజాతీయమువలె భాసించును. అబ్బో! విజాతీయత దెలిసికొనుటయు నింత కష్టమైన విషయముగా భగవంతుడు సృష్టించును కాబోలు! (జేబు దొంగలు)

## 578

ఆయన వచ్చాడు. (మంత్రి) ఆయన రావటంలో ఎంత ఫెళ ఫెళగా వచ్చాడు? గంజి మడతలు పనికిరానంత ఫెళ ఫెళగా వచ్చాడు. పూర్వకాలపు గంజి మడతలకూ ఇప్పటి గంజి మడతల్లో వట్టి ఫెళ ఫెళే ఉండేది. ఈ కాలపు గంజి మడతల్లో ఫెళ ఫెళ అట్లాగే వుంటుంది. కాని ఇస్త్రీ చేయటం మూలంగా మంచి నునుపుగా వుండి ఆ ఫెళఫెళ



లేదనిపిస్తుంది. అదేగా కావలసింది. నేను ప్రజల యొక్క మనిషిని అంటూ వుండాలి. వాడి ఫెళఫెళ వాడికే వుంది. పూర్వకాలపు రాజులు పూర్వపుచాకలివాడు వుతుక్కు వచ్చే వట్టి గంజి మడతలవంటివాళ్ళు. ఇప్పటి కాలపు మంత్రులు ఇస్త్రీ చేసిన గంజిమడతలు. (దమయంతీ స్వయంవరం)

## 579

నేరం జరిగేది ఒకచోట, పరిష్కరింపబడేది మరొకచోట. అన్నీ సాక్ష్యాలమీద నిర్ణయించబడే న్యాయ వ్యవస్థలు వెలిశాయి.డబ్బున్నవాడు డబ్బుతో న్యాయం నోరునొక్కేశాడు. పేదవాడు నిస్సహాయుడైపోయాడు.

## 580

మరి వందల కావ్యములు కలవు. పఠింపబడుచున్నవి. వీని సంగతియేమి? లక్షల జనమున్నారు. వీరిలో పరిణతి ప్రజ్ఞులైన వారి సంఖ్య మిక్కిలి తక్కువ. సర్వజనులకు గామవాంఛ కలదు. అందరును సంతానము కందురు. కాని సీతారాముల వంటి వారు, నలదమయంతుల వంటి వారు కొన్ని కోట్ల సంవత్సరములు సృష్టి సాగగా చెప్పుకోదగ్గవారు వార్రైరి. మహాకవుల సంఖ్యయు మహానుభావుల సంఖ్యయు నట్టి ప్రమాణములో నుండును. తక్కిన వారును వారికి యోగ్యములైన గ్రంథములు వారు చదువు చుందురు. వారి శక్తికి దగిన రమణమును వారు పొందుచుందురు. గంతకు దగిన బొంత కదా! (పీఠికలు 1-సింహబలి)

## 581

బజారులో పండనేది లేదు. బత్తాయికాయ వంటి కాయ అర్ధరూపాయి. కొని యింటికి తీసుకువస్తే అందులో రసం వుండదు. శేరు ముప్పావలా పెట్టి పాలుకొంటే అందులో వుండేవి పావలా పాలు. ఆ డాక్టర్లేమో ఈ రెంటిమీద బతకమంటారు, వీళ్ళతో ఎలా వేగేది. (బాణావతి)

## 582

నాలుగు వర్ణములు, పంచములు కలసి గ్రామవ్యవస్థ సాగేది. "ఒక గ్రామమునకు మరియొక గ్రామమునుండి పిల్లనిచ్చినచో మా పిల్లను ఆ ఊరికిచ్చితిమి" అనెడివారు. అది ఒక రహస్యము. వారికిచ్చితిమని కాదు. ఊరికిచ్చుట యనగా, ఊరు సమిష్టి కుటుంబమని యర్థమని విశ్వనాథ తన అనుభవాలు చెబుతూ "మా యూరిలో నున్న అన్ని వర్ణములవారు బంధువులవలె నుండు చుండగా ఒకనినొకరు వరుసలతో పిలుచుకొనెడివారు. నా చిన్నప్పుడు మాగూడెములోని మాలమాదిగలను కూడ పిల్లవాండ్రమైన మేము పేర్లు పెట్టి పిలవరాదు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=752**

* * *

**Read other books by Dr. V. Kondal Rao@**

**http://kinige.com/kbrowse.php?via=author&id=164**